సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం : 8 : ఆగస్టు : 2025



శాంతి కల్యాణం

ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం శాంతి కల్యాణం జరిపించారు.



జోరుగా చేపనారు ఉత్పత్తి

బాదంపూడి ప్రభుత్వ మత్స్య కేంద్రంలో చేపనారు ఉత్పత్తి జోరుగా సాగుతోంది. చేపనారు ఉత్పత్తి లక్ష్యం 24 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించింది. 8లో ▸



స్నాతకోత్సవానికి నిట్ సిద్ధం

తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్ 7వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. శనివారం ఉదయం వేడుకలు ప్రారంభం కానున్నాయని ఇన్‌చార్జి డైరెక్టర్ తెలిపారు. 8లో ▸

న్యూస్‌రీల్

షోకాజ్ నోటీసుల ఉపసంహరణ

సాక్షి స్పందన

భీమవరం(ప్రకాశం చౌక్): పీ4 సర్వేకు సంబంధించి భీమవరంలో 26 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై ఇటీవల 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. విషయాన్ని ఉద్యోగుల సంఘ నాయకులు రాష్ట్రస్థాయి అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించారు. 26 మంది సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు విత్‌డ్రా చేసుకోవాలని ఆదేశించడంతో మున్సిపల్ కమిషనర్ ఈ దిశగా చర్యలు తీసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

మందకొడి సర్వేతోనే..

పట్టణంలో పీ4 సర్వే మందకొడిగా జరగడంతో కొందరు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు ఇచ్చామని మున్సిపల్ కమిషన్ కె.రామచంద్రా రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో కేవలం 12 శాతం మాత్రమే సర్వే జరిగిందని, 12 సచివాలయాల్లో సర్వే కనీసం మొదలు కాలేదన్నారు. ఈ క్రమంలోనే నోటీసులు ఇచ్చామని, ఉద్యోగులపై ఎలాంటి ఒత్తిడి లేదని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

భీమవరం: గురు పూజోత్సవం సందర్భంగా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయులకు అవార్డులు అందించనున్నామని, ఈనెల 8లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఈ.నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కనీసం పదేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్నవారు అర్హులన్నారు. 16న తుది జాబితా రాష్ట్ర కార్యాలయానికి పంపిస్తామని, 21 నుంచి మూడు రోజులపాటు రాష్ట్రస్థాయిలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 25న ఎంపికైన వారి తుది జాబితాను విడుదల చేస్తారని డీఈఓ నారాయణ తెలిపారు.

చేనేత వస్త్రాలను ఆదరించాలి



చేనేత వస్త్రాలను తిలకిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో చేనేత వస్త్రాలకు విస్తృత ప్రచారం కల్పించి, మార్కెటింగ్‌ను పెంపొందించాలని ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సూచించారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ప్రకాశం చౌక్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకం ప్రారంభం, నేత కార్మికులకు సత్కారం కార్యక్రమాల్లో ఇన్‌చార్జి కలెక్టర్, రాష్ట్ర మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ చైర్మన్ పీతల సుజాత పాల్గొన్నారు. ఆర్డీఓ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కె.అప్పారావు, మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, నేత కార్మికులు పాల్గొన్నారు.

మార్గదర్శిగా నమోదు స్వచ్ఛందమే..

పీ4పై అవగాహన లేకుండా ప్రజలకు వక్రభాష్యం చెప్పే ప్రచారాన్ని ఉపేక్షించేది లేదని ఇన్‌చార్జి కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. బంగారు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శుల ఎంపిక పూర్తిగా స్వచ్ఛందంగానే జరుగుతోందన్నారు. మార్గదర్శుల నమోదుకు ఒత్తిడి లేదన్నారు. బంగారు కుటుంబాలను మార్గదర్శులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి దత్తత తీసుకోవాలనేది ప్రభుత్వ ఉద్దేశమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లకు స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి ఇన్‌చార్జి కలెక్టర్, అధికారులు హాజరయ్యారు.

బ్యాంకు ఏజెంట్ల పేరుతో మోసం

భీమవరం: బ్యాంకు రికవరీ ఏజెంట్లుమంటూ ఇద్దరు వ్యక్తులు భీమవరం ఏడో వార్డుకు చెందిన కె.రామలక్ష్మి నుంచి రూ.2 లక్షలు తీసుకుని మోసగించినట్టు పోలీసులు తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్‌లో భవనానికి మార్టిగేజ్ రుణం తీసుకున్నారు. వాయిదా చెల్లించాల్సి ఉండగా హైకోర్టులో స్టే వేద్దామని చెప్పి నగదు తీసుకుని ఇప్పటివరకు సమాధానం చెప్పడం లేదని రామలక్ష్మి ఫిర్యాదులో పేర్కొనగా ఎస్సై బీవై కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): పంచారామ క్షేత్రం గునుపూడి ఉమాసోమేశ్వర జనార్దన స్వామి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం లెక్కించారు. రూ.10,50,655 లభించినట్టు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు.. స్వామి వారి నిత్యాన్నదానానికి రూ.18,886 లభించిందన్నారు. కార్యనిర్వహణాధికారి కర్రి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం.. సేవలు నిర్వీర్యం

కూటమి శీతకన్ను

- నిర్వహణ లేక మూలన పడుతున్న కంప్యూటర్లు, సామగ్రి
- జిల్లాలో 535 సచివాలయాలు
- అందించిన పరికరాలు 4,815
- పనిచేస్తున్నవి 2,088 మాత్రమే
- ప్రజలు, ఉద్యోగుల అవస్థలు



పాలకోడేరు మండలంలోని ఓ సచివాలయంలో మూలకు చేరిన కంప్యూటర్, ప్రింటర్

పరికరాలు	మొత్తం	పని చేస్తున్నవి	పని చేయనివి
సీపీయూలు	1,070	749	321
మోనిటర్లు	1,070	857	213
ప్రింటర్లు	535	284	251
యూపీఎస్‌లు	535	69	466
బ్యాటరీలు	1,605	129	1,476



పనిచేయని ప్రింటర్

సాక్షి, భీమవరం: ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన సచివాలయ వ్యవస్థపై చంద్రబాబు సర్కారు శీతకన్ను వేసింది. కంప్యూటర్లు, ప్రింటర్లు, బ్యాటరీలు తదితర వాటికి నిర్వహణ కరువైంది. మరమ్మతులతో కొన్ని షట్‌డౌన్ కాగా.. మిగిలినవి తరచూ మొరాయిస్తుండటంతో సచివాలయ సేవల కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారు.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మకంగా..

గత ప్రభుత్వం జిల్లాలో 398 గ్రామ, 137 వార్డు సచివాలయాలను ఏర్పాటుచేసింది. ఒక్కో సచివాలయానికి సచివాలయ సెక్రటరీ, ఇంజినీరింగ్, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, హార్టీకల్చర్, వెటర్నరీ, డిజిటల్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, విలేజ్ సర్వేయర్ తదితర 10 నుంచి 11 పోస్టులను నియమించింది. రేషన్ కార్డులు, పింఛన్లు, సర్టిఫికెట్లు, ఆరోగ్యశ్రీ, భూరికార్డులు తదితర 500లకు పైగా సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆయా సేవలను బట్టి తక్షణ పరిష్కారం, కొన్ని 72 గంటలు, మరికొన్ని వారం నుంచి రెండు వారాల వ్యవధిలో పరిష్కరించేలా టైం బాండ్ సైతం పెట్టింది.

సేవలు సక్రమంగా అందేలా..

సేవల్లో పారదర్శకత, సమయ పాలన, వ్యవస్థ సక్రమంగా పనిచేసేందుకు ఒక్కో సచివాలయానికి రెండు నుంచి మూడు వరకు కంప్యూటర్లు, ప్రింటర్లు, బ్యాటరీలు తదితర సామగ్రిని అందజేశారు. అప్పటికే పంచాయతీల్లో ఉన్న కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సామగ్రిని మినహాయించి మిగిలిన పరికరాలను ఇచ్చారు. మొత్తం 535 సచివాలయాలకు గాను గత ప్రభుత్వంలో కొత్తగా 1,070 సీపీయూలు, 1,070 మోనిటర్లు, 535 ప్రింటర్లు, 535 యూపీఎస్‌లు, 1,605 బ్యాటరీలు కలిపి మొత్తం 4,815 పరికరాలను అందజేశారు. పంచాయతీలు, పురపాలక సంస్థలు వీటి నిర్వహణను పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా పరికరాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తితే సేవలకు ఆటంకం కలగకుండా వెంటనే మరమ్మతులు చేయించే పరిస్థితి గత ప్రభుత్వ హయాంలో ఉండేది.

కూటమి పాలనలో పర్యవేక్షణ కరువు

కూటమి పాలనలో సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడింది. కంప్యూటర్లు, ప్రింటర్లు తదితర పరికరాలు మరమ్మతులతో మూలకు చేరుతున్నాయి. కొన్నిచోట్ల స్టేషనరీ కూడా ఇవ్వక ఉద్యోగులు సొంత సొమ్ములు వెచ్చించి కొనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడం, అప్‌డేట్ తదితర అన్ని పనులకు కంప్యూటర్లే ఆధారం. ఉన్న వాటిలో కొన్ని సరిగా పనిచేయక తరచూ మొరాయిస్తుండటంతో ఉద్యోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సాధారణంగా సచివాలయాల్లో చాలా వరకు సేవలను ఉచితంగా అందిస్తారు. కొన్నిచోట్ల కంప్యూటర్లు పనిచేయక ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకోమ్మని సూచిస్తుండటంతో పేదలపై ఆర్థిక భారం పడుతోంది. ఆన్‌లైన్ సెంటర్లలో అధిక రుసుం చెల్లించాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. పూర్తిస్థాయిలో పరికరాలు కంప్యూటర్లు, ప్రింటర్లు, ఇతర సామగ్రికి మరమ్మతులు చేయించడం ద్వారా మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాగా సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు, బ్యాటరీల్లో ప్రస్తుతం ఎన్ని పనిచేస్తున్నాయి?, ఎన్ని పనిచేయడం లేదు? అదనంగా అవసరమైన పరికరాల కోసం ప్రభుత్వానికి నివేదించినట్టు అధికారులు చెబుతున్నారు.

ఇసుక దందా



ఆచంట మండలంలో ఇసుక లోడింగ్

పెనుగొండ: ఇసుక అక్రమ నిల్వలు కాసులు కురిపిస్తున్నాయి. ఆచంట మండలంలో కూటమి నాయకులు భారీ ఎత్తున ఇసుకను అక్రమంగా నిల్వ చేశారు. గోదావరికి వరద నీరు రావడంతో నెమ్మదిగా అమ్మకాలకు తెరలేపారు. ఇసుక అమ్మకాలు జోరుగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజులుగా ఆచంట మండలంలో ఇసుక అమ్మకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. ఐదు యూనిట్ల ఇసుక రూ.9 వేలకు విక్రయిస్తున్నారు. సిద్ధాంతం నుంచి నరసాపురం వరకూ ఇసుక తవ్వకాలకు గ్రీన్ ట్రిబ్యునల్ అభ్యంతరంతో ర్యాంపు తెరుచుకోలేదు. అయినా పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా నిర్వహించి మండలంలో పలుచోట్ల నిల్వ ఉంచారు.

వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌ల ఫిర్యాదు

ఆచంట మండలంలో ఇసుక అక్రమల నిల్వలపై వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు కొందరు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం ఇసుకను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేసినా అధికారుల నుంచి స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఇసుక నిల్వ చేసిన కూటమి నేతలు అమ్మకాలు ప్రారంభించారు. గుట్టలు త్వరగా ఖాళీ చేసి ఎలాంటి నిల్వలు లేవని నమ్మించాలని చూస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అంటున్నారు. అక్రమార్కులకు అధికారులు వత్తాసు పలుకుతున్నారని విమర్శిస్తున్నారు. సత్వరం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రాజ్యాంగానికి రఘురామ వక్రభాష్యం



పాములపర్రులో దళితులకు సంఘీభావం తెలుపుతున్న దళిత ఏపీ బహుజన జేఏసీ రాష్ట్ర నాయకులు

ఏపీ బహుజన జేఏసీ

ఉండి: రాజ్యాంగం కల్పించిన హక్కులకు వక్రభాష్యం చెబుతూ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఏపీ బహుజన జేఏసీ రాష్ట్ర నాయకులు అన్నారు. పాములపర్రులో జరిగిన ఘటనపై వివరణ ఇస్తూ రఘురామకృష్ణరాజు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పాములపర్రు దళితులు, జేఏసీ రాష్ట్ర నాయకులు గురువారం నిరసన తెలిపారు. ఏపీ బహుజన జేఏసీ ఫౌండర్, కన్వీనర్ తాళ్లూరి మధు మాట్లాడుతూ మత స్వేచ్ఛ రాజ్యాంగం ప్రసాదించిన హక్కు అని, దీనిని కాదని క్రైస్తవ మతానికి చెందిన వారు దళితులు కారని ఎమ్మెల్యే ఎలా మాట్లాడతారని మండిపడ్డారు. రాష్ట్రంలో వివిద కులాలకు చెందిన వారు క్రీస్తును నమ్ముకున్నారు వారిని క్రైస్తవులుగా మార్చేస్తారా? వారి కులాన్ని కాదంటారా? అంటూ ప్రశ్నించారు. కూటమి నాయకుల తప్పుడు సమాచారంతోనే ఎమ్మెల్యే రఘురామ మాట్లాడుతున్నారన్నారు. గతంలో అధికారులు ఇచ్చిన శ్మశాన భూమి రికార్డులు పరిశీలించడంతో పాటు 150 ఏళ్ల నుంచి ఇక్కడ సమాధులున్నాయని గమనించాలన్నారు. స్థానికంగా వరిచేలు లేవని, ఉన్నవి రొయ్యల చెరువులేనన్నారు. నలుగురు రైతుల సంక్షేమం కోసం వందల మంది మనోభావాలు దెబ్బతినేలా దళితులకు ప్రత్యేకమైన శ్మశాన భూమిని పాడుచేసేలా రోడ్డు నిర్మాణం చేస్తారా అని మండిపడ్డారు. పాములపర్రులో దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామని చెప్పారు. ఈ ఘటనపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మాజీ సీఎం జగన్, జాతీయ మానవ హక్కుల సంఘాలకు ఫిర్యాదు చేసినట్టు ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా ఉండిలో ఓ కూటమి నేత ఇంటికి రాత్రి వేళలో ఓ పోలీస్ అధికారి వెళ్లడం, వారితోపాటు శ్మశానంలో రోడ్డు కావాలంటూ ప్రేరేపించిన కూటమి నాయకులు ఉండటం అనుమానాలకు తావిస్తోందని దళితులు చెబుతున్నారు.

కూటమి పాలనలో రక్షణ కరువు



భీమవరం ప్రకాశం చౌక్‌లో ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

భీమవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అన్నివర్గాల ప్రజలకు రక్షణ లేదని, రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శివకుమార్ గౌడ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, పార్టీ నేత వేల్పుల రామలింగారెడ్డిపై జరిగిన దాడికి నిరసనగా గురువారం భీమవరం ప్రకాశం చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొని వస్తున్న నాయకులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయలేని కూటమి ప్రభుత్వం, అడ్డదారిలో గెలవడానికి ఓటర్లను భయాందోళనకు గురిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ అరాచకాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల ముందుంచడంతో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. ప్రభుత్వం పద్ధతి మార్చుకుని సూపర్‌సిక్స్ హామీలను తక్షణం అమలుచేయాలని లేకుంటే ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగ అధ్యక్షుడు పెండ్ర వీరన్న, యూత్‌వింగ్ జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్ మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణ లేదన్నారు. బలహీన వర్గాల ప్రజాప్రతినిధులపై వరుస దాడులతో వైఎస్సార్‌సీపీని బలహీనపర్చలేరన్నారు. పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు జహంగీర్, పట్టణ శాఖ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, పార్టీ నాయకులు బాలాజీ, గంటా సుందరకుమార్, కమతం మహేష్, పాలా లక్ష్మీచక్రధర్, గేదెల నర్సింహరావు, పతివాడ మార్కండేయులు, ఈద జాషువ, రుద్రాక్షల శ్రీను, తుంపాల శ్రీను, షేక్ రబ్బాని, రాయవరపు శ్రీనివాసరావు, పాలా నాగరాజు, వీరవల్లి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

బాల పురస్కార్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుల కోసం ఈనెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని డీసీపీఓ సూర్యచక్రవేణి గురువారం ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ధైర్య సాహసాలు, ప్రతిభ కనబర్చిన 5–18 ఏళ్లలోపు బాలలు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ 7901597267లో సంప్రదించాలని కోరారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉద్యోగ, ఉపాధ్యాయులకు నిరాశను మిగిల్చిందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ఓ ప్రకటనలో తెలిపారు. పెండింగ్ బకాయిలు, డీఏలు, ఆర్థిక ప్రయోజనాలు, 12వ పీఆర్‌సీ, ఐఆర్ గురించి ప్రభుత్వం ప్రకటించలేదన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలపై మాట్లాడకపోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. 2004లో ఉపాధ్యాయ, ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేసిన నాటి టీడీపీ ప్రభుత్వాన్ని గద్దెదింపిన విషయాన్ని గుర్తుచేశారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి మూడు నెలలు కావస్తున్నా కొందరికి జీతాలు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాలతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

అంగన్‌వాడీలతో సెల్‌గాటం

యాప్‌ల కత్తి

- సపోర్టు చేయని ఫోన్లతో ఇబ్బందులు
- ముఖ ఆధారిత గుర్తింపుతోనే రేషన్
- పనిచేయని యాప్‌లు.. అధికారుల ఒత్తిళ్లు
- ఐసీడీఎస్ కార్యాలయాల్లో ఫోన్ల అప్పగింత
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసనలు



ఏలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): 'సిగ్నల్స్ పని చేయవు.. యాప్స్ సపోర్టు చేయవు.. గతంలో 2జీ ఫోన్లు ఇచ్చారు.. ప్రస్తుతం 5జీ యాప్స్ అప్‌లోడ్ చేయమంటున్నారు.. యాప్‌ల సాకుతో ఫేస్ రికగ్నైజ్ కాకపోతే **రేషన్ కట్ చేస్తామంటున్నారు.. ఇలాగైతే అంగన్‌వాడీ కేంద్రాలను నడిపేది ఎలా.. తాము విధులు నిర్వర్తించేది ఎలా..'** అంటూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ఫోన్లు అయినా ఇవ్వండి లేదా యాప్‌లను రద్దయినా చేయండి అంటూ అంగన్‌వాడీలు అధికారులను వేడుకుంటున్నారు. యాప్‌లపై కనీస శిక్షణ ఇవ్వకుండా, యాప్‌లను సపోర్టు చేసే ఫోన్లను అందించకుండా మెడపై కత్తి పెట్టి మరీ పనిచేయంటే ఎలా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో సెల్‌ఫోన్లను అప్పగిస్తూ నిరసన తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో కార్యకర్తలను ఐసీడీఎస్ అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని పలు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. రెండు జిల్లాల పరిధిలో 3,851 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, అదే సంఖ్యలో సహాయకులు పనిచేస్తున్నారు.

యాప్‌లలో అప్‌లోడ్ తిప్పలు

అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించి కార్యకలాపాలను బాల సంజీవని, పోషణ ట్రాకర్ యాప్‌ల ద్వారా నిర్వహించాలి. ఫేస్ యాప్, ఫేస్ క్యాప్చర్, కేవైసీ, ఓటీపీ వంటి పనులు చేసేందుకు ప్రస్తుతం ఉన్న ఫోన్లు సహకరించడం లేదు.

ఫేస్ క్యాప్చర్ అయితేనే..

యాప్‌లలో ఫేస్ క్యాప్చర్ అయితేనే అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఆహారం ఇవ్వాలి. దీంతో లబ్ధిదారులకు ముఖ ఆధారిత గుర్తింపుతో ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో కుటుంబంలో ఎవరూ వచ్చినా రేషన్ ఇచ్చేవారు. ఇప్పుడు లబ్ధిదారుడు తప్పనిసరిగా ఉండాలి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్‌కు నిధులు తగ్గిస్తోంది. దీంతో అరకొర సౌకర్యాలతో సెంటర్లు నడుస్తున్నారు. నాణ్యమైన ఆహారం అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. దీనికితోడు యాప్‌లతో ఇబ్బంది పడుతున్నామని, సిగ్నల్స్ సరిగా లేక, సర్వర్ పనిచేయక తిప్పలు పడుతుంటే.. అధికారుల వేధింపులు ఎక్కువయ్యాయని అంగన్‌వాడీలు అంటున్నారు. పదో తరగతి చదివిన తమను యాప్‌లలో పనిచేయాలంటే ఎలా అని అంగన్‌వాడీలు ప్రశ్నిస్తున్నారు. ఒక లబ్ధిదారుడి ఫేస్ క్యాప్చర్ చేయాలంటే రెండు, మూడు గంటల సమయం పడుతుందంటున్నారు. ఒక్కో కేంద్రంలో సగటున మూడేళ్లలోపు పిల్లలు 50 నుంచి 60 మంది, గర్భిణులు, బాలింతలు 10 నుంచి 15 మంది వరకు, ప్రీ స్కూల్ పిల్లలు 10 నుంచి 20 మంది, కిశోర బాలికలు 10 నుంచి 50 మందిలోపు ఉంటారని అంటున్నారు. వీరందరికీ ప్రతినెలా ఈకేవైసీ, ఓటీపీ, ఫేస్ క్యాప్చర్ చేయాలంటే సమయం సరిపోవడం లేదని అంగన్‌వాడీలు ఆవేదన చెందుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు

	ఏలూరు జిల్లా	పశ్చిమగోదావరి జిల్లా
మెయిన్ కేంద్రాలు	1,959	1,556
మినీ కేంద్రాలు	206	70
మొత్తం	2,165	1,626

అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులు

	పశ్చిమగోదావరి	ఏలూరు
ఆరేళ్లలోపు పిల్లలు	43,783	41,116
మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు	19,672	19,909
గర్భిణులు	8,596	7,889
బాలింతలు	6,170	5,606
మొత్తం	78,221	74,520

వేధింపులు ఆపాలి



పనిచేయని ఫోన్లను తిరిగి అప్పగించిన అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు మానాలి. టార్గెట్ల పేరుతో అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులు ఆపకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం ఉధృతం చేస్తాం.

– డీఎన్‌వీడీ ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి, ఏలూరు

వెసులుబాటు కల్పించాలి



ఫేస్ క్యాప్చర్‌తో నిమిత్తం లేకుండా మాన్యువల్‌గా రేషన్ ఇచ్చే వెసులుబాటు కల్పించాలి. యాప్‌ల వల్ల మాతో పాటు లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లబ్ధిదారులు ఓటీపీ చెప్పేందుకు సంబంధిత ఫోన్లు అందుబాటులో ఉండటం లేదు.

– పి.సుజాత, జిల్లా అధ్యక్షురాలు, ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏలూరు జిల్లా

అప్‌లోడ్ కావడం లేదు



మాకిచ్చిన ఫోన్లలో యాప్‌లు అప్‌లోడ్ అవడం లేదు. పీడీఎఫ్ ఫైల్స్ ఓపెన్ కావడం లేదు. దీనికితోడు స్వర్ణాంధ్ర యాప్ పనులు చేయమంటున్నారు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. అయినా అధికారులు టార్గెట్లు పూర్తి చేయాలని ఒత్తిడి తెస్తున్నారు.

– పి.భారతి, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏలూరు జిల్లా

5జీ ఫోన్లు ఇవ్వాలి



తక్షణమే అంగన్‌వాడీలకు 5జీ ర్యామ్ ఉన్న ఫోన్లను ఇవ్వాలి. పాత ఫోన్లలో న్యూవెర్షన్ యాప్‌లను అప్‌లోడ్ చేయమంటే ఎలా. ఐసీడీఎస్ అధికారులు అర్థం చేసుకోవాలే తప్ప మాపై కక్ష సాధింపులకు దిగడం సరికాదు. అన్ని యాప్‌లను కలిపి ఒకే యాప్‌గా మార్చాలి.

– టి.మాణిక్యం, జిల్లా కోశాధికారి,ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఏలూరు జిల్లా

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్న అధికారులు

ముసునూరు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టుకుని సీజ్ చేసినట్లు నూజివీడు సివిల్ సప్లయి స్పెషల్ డిప్యూటీ తహసీల్దార్ గుండుబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు. బాపులపాడు మండలం కాకులపాడు ప్రాంతం నుంచి వాహనంలో మండలంలోని గుళ్ళపూడి మీదుగా అక్రమంగా తరలిస్తున్న 41 క్వింటాళ్ల రేషన్ బియ్యంను ఏలూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున దాడి చేసి పట్టుకున్నామన్నారు. బియ్యాన్ని తరలిస్తున్న కడలి లక్ష్మణరావు, ధనికొండ గోపిరాజు, బండారు నాగబాబు, కొల్లి కాసులు, షేక్ ఖాసింబాబులపై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు ఏలూరులో కోకో రైతుల రాష్ట్ర సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర సమావేశం ఏలూరు పవర్‌పేటలోని అన్నే భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోకో గింజల ధర కిలోకు రూ. 500 నుంచి రూ. 350కు క్రమంగా తగ్గించివేయడం దారుణమని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని శ్రీనివాస్ తెలిపారు.

బైక్ దొంగల అరెస్టు

ఆకివీడు: ఇద్దరు దొంగలను పట్టుకుని వారి నుంచి తొమ్మిది మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆకివీడు రూరల్ సీఐ జగదీశ్వరరావు, ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపారు. నిందితులు కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం ఎండపల్లి గ్రామానికి చెందిన కూనసాని నాగాంజనేయులు, ఆకివీడు మండలం చినకాపవరం గ్రామానికి చెందిన కుప్పల రమేష్‌లను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచామన్నారు. డీఎస్పీ జయ సూర్య పర్యవేక్షణలో ఉండి ఎస్సై నజీరుల్లా, విజయ్, శివ, శంకర్, రత్నంల సహకారంతో కేసును ఛేదిచామన్నారు.

22న సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టు

సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ సత్యనారాయణ



సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ శ్రీకాకుళం, అనకాపల్లి, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, పాడేరు సర్కిళ్ల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 11 నుంచి క్యాంపు కోర్టులు నిర్వహించనున్నట్లు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్మన్ విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ వెల్లడించారు. ఇందులో భాగంగా ఈనెల 22న భీమవరం డివిజన్ ఉండి సెక్షన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరిగే క్యాంపు కోర్టులో వినియోగదారులు పాల్గొనవచ్చని తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం తదితర సమస్యలపై వినియోగదారులు నేరుగా సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. సదస్సుల్లో ఛైర్‌పర్సన్ బి.సత్యనారాయణతో పాటు సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు ఎస్.రాజబాబు, ఎస్.సుబ్బారావు, ఎన్.మురళీకృష్ణ పాల్గొననున్నారు.

జోరుగా చేపనారు ఉత్పత్తి

- ఈ ఏడాది ఉత్పత్తి లక్ష్యం 24 కోట్లు
- ఇప్పటివరకు 4.40 కోట్ల ఉత్పత్తి పూర్తి
- ఉత్పత్తి చేసిన చేపనారు ప్రభుత్వ ఫారాలకు సరఫరా

ఉంగుటూరు: రాష్ట్రంలోనే పేరుగాంచిన బాదంపూడి ప్రభుత్వ మత్స్య కేంద్రంలో చేపనారు ఉత్పత్తి జోరుగా సాగుతోంది. ఇక్కడ చేపనారు ఉత్పత్తి జూలై నుంచి ప్రారంభించి నవంబరు వరకు కొనసాగిస్తారు. ఈ ఏడాది చేపనారు ఉత్పత్తి లక్ష్యం 24 కోట్లుగా ప్రభుత్వం నిర్దేశించగా జూలైలో 4 కోట్ల 40 లక్షలు చేపనారు ఉత్పత్తి పూర్తి చేశారు. రాహు, కట్ల, మ్రిగాలా, కామన్ రకాలు పిల్లలు ఇక్కడ ఉత్పత్తి చేస్తారు. ఉత్పత్తి చేసిన చేపనారు పిల్లలను కొవ్వలి, ఏలూరు, తణకు, కర్నూలు, గాజుల దిన్నె, మోటూరు, తదితర ప్రభుత్వ ఫారాలకు సరఫరా చేశారు. ఫారంలో ఒక ఫీల్డ్‌మేన్, ఒక ఫిషర్‌మేన్, ఇద్దరు కూలీలు పనిచేస్తున్నారు. రెండు అంగుళాలు ఉన్న చేపపిల్లలు ఫింగర్ లింగ్సు టార్గెట్ ఒక కోటిగా ఉంది. 90 లక్షలు ఇప్పటికే నిల్వ చేసి ఉంచారు.

చైనీస్ విధానంలోనే ఉత్పత్తి

చేపనారు ఉత్పత్తి చైనీస్ హేచరీస్‌లోనే ఉత్పత్తి చేయడం జరుగుతోంది. మేలుజాతి తల్లిచేపలను ముందుగానే సేకరించి చెరువుల్లో పెంచుతారు. వాటిలో ముందురోజు సాయంత్రం తల్లి చేపలు మగ, ఆడకు ఓవ సీస్ (తల్లి చేపలకు హార్మోన్) ఇంజక్షన్ ఇస్తారు. ఆ రెండు చేపలు సంయోగ ప్రక్రియ ద్వారా గుడ్లను విడుదల చేస్తాయి. ఈరెండు బాహ్యఫలదీకరణ చెందిన గుడ్లు ఏర్పడుతాయి. ఇవి నీటిని షోచించుకుని ఉబ్బి ఉదయానికి గుడ్ల మధ్యలో స్పష్టమైన కేంద్రకుము ఏర్పడుతుంది. ఈ గుడ్లు తరువాత సమవిభజనతో అభివృద్ధి చెంది వివిధ దశలగా రూపాంతరం చెందుతూ స్పాన్‌గా తయారవుతుంది. బ్రీడింగును సాయంత్రం వేళలో నిర్వహిస్తారు. తరువాత రోజు ఉదయానికి గుడ్లు ఏర్పడతాయి. ఈ గుడ్లు మరుసటి రోజు సాయంత్రానికి ఒక వయస్సు కలిగిన స్పాన్‌గా ఉత్పత్తి అవుతాయి. ఇలా అభివృద్ధి చెందిన స్పాన్ మరో రెండు రోజులు హేచరీ నందు ఉంచడం జరుగుతుంది. మెత్తంగా మూడురోజులు కలిగిన స్పాన్‌ను ఉత్పత్తి చేయడం జరుగుతుంది. 6 గంటల సమయంలో చైనీస్ హేచరీలో వేస్తారు. ఇలాచేపనారు ఉత్పత్తిచేసి ప్రభుత్వ ఫారాలకు సరఫరా చేస్తారు.



బాదంపూడి చేపల కేంద్రంలో తల్లి చేపలకు ఇంజక్షన్ ఇస్తున్న దృశ్యం



తయారైన చిరుచేప



కేంద్రంలో ఏడీఏ నర్సయ్య పర్యవేక్షిస్తున్న దృశ్యం



చేప పిల్లలను పంపిస్తున్న దృశ్యం

రాష్ట్రంలోనే ప్రసిద్ధి గాంచింది

రాష్ట్రంలోనే పేరు గాంచిన ఈ చేపల ఉత్పత్తి కేంద్రానికి అనుబంధంగా శిక్షణా కళాశాల నడుస్తోంది. ఇందులో మూడు నెలలు కోర్సు ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇక్కడ చదువుకున్న వారికి ఫిషర్‌మేన్ ఇతర ప్రభుత్వ ప్రైవేట్ ఫారాల్లో పోస్టులు కూడా చేస్తున్నారు. అందువల్ల ఈశిక్షణా కేంద్రానికి ఉమ్మడి రాష్ట్రంలోనే పేరుంది. కాగా బాదంపూడి మత్స్య కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. ఈ క్షేత్రంలో నూతన భవనాలు లేకపోవడంతో తల్లి చేపలు పెంచడంలేదు. సమయానికి కొనుగోలు చేసి కాలం వెళ్లదీస్తున్నారు. తగినంతమంది సిబ్బంది లేకపోవడం, జిల్లా, రాష్ట్ర స్థాయి మత్స్య శాఖ అధికారుల పర్యవేక్షణా లోపం కూడా ఇక్కడ ఉంది.

వైభవంగా శ్రీవారి పవిత్రోత్సవాలు ప్రారంభం



ఆలయ యాగశాలలో అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య పవిత్రోత్సవాలు గురువారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ఆలయ యాగశాలలో అర్చకులు విష్వక్సేనపూజ, పుణ్యహావాచనము, అజాప్రదీపారాధన, వాస్తుపూజ, మృత్సంగ్రహణ, అలాగే వాస్తు హోమం, పవిత్ర శుద్ధిని జరిపారు. అనంతరం అంకురార్పణను నిర్వహించి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. అంతకముందు అర్చకులు, పండితులు పుట్టమన్నును తెచ్చి సిద్ధంగా ఉంచిన పాలికల్లో పోశారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ నవధాన్యాలను పాలికల్లో ఉంచారు. దాంతో అంకురార్పణ కార్యక్రమం ముగిసింది. ఆలయంలో ఏడాది పొడవునా తెలిసీ, తెలియక జరిగిన తప్పుల ప్రాయఃశ్చిత్తం నిమిత్తం ఈ పవిత్రోత్సవాలను జరపడం సంప్రదాయంగా వస్తోంది.

పంట కాలువకు గండి



కాకిలేరు-కొయ్యేటిపాడుకి మధ్య పంట కాలువ వద్ద పడిన గండి

ఇరగవరం: కాకిలేరు నుంచి కొయ్యేటిపాడు మీదుగా వెళ్లే రాపాక చానల్ పంట కాలువకు బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి గండి పడింది. దీంతో వర్షపు నీరు పొలాల్లోకి చేరడంతో రైతులు ఆందోళన చెందారు. ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇవ్వగా రాపాక చానెల్ నీరు నిలుపుదల చేసి గండి పూడ్చారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి నేతలు పనులు పంచుకుని వేసవిలో కాలువ ఆధునీకీకరణ పనులు నాసిరకంగా చేశారని, పర్యవేక్షించాల్సిన అధికారులు అలసత్వం వహించడంతో ఇప్పుడు ఇబ్బందులు పడుతున్నామని రైతులు వాపోయారు. దీనిపై మార్టేరు ఇరిగేషన్ జేఈ జై శంకర్‌ని వివరణ కోరగా కాలువను ఆధునీకరిస్తు ఉండగా రైతులు తమ దృష్టికి తీసుకురాకుండా తూర ఏర్పాటు చేసుకున్నారని, దాని చుట్టూ మట్టి నెరలు ఏర్పడ్డాయని, అవి ఇప్పుడు వర్షానికి కరిగిపోయి గండిగా ఏర్పడిందని, మరమ్మతులు చేసినట్లు చెప్పారు.

స్నాతకోత్సవానికి నిట్ సిద్ధం

తాడేపల్లిగూడెం: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఏపీ నిట్) ఏడవ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. ఈ నెల 9వ తేదీ ఉదయం నిట్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ వేడుక జరుగనుంది. ఈ వేడుకలో 2021–25 బ్యాచ్ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనున్నారు. ముఖ్యఅతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంటు వి.రాజన్న హాజరవుతున్నారని ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్‌వీ.రమణరావు తెలిపారు. రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో అవసరమైన ఏర్పాట్లు చేశారు. 2015లో ఏపీ నిట్ ఏర్పాటుకాగా, ఇప్పటి వరకు నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సును ఏడు బ్యాచ్‌ల విద్యార్థులు పూర్తి చేసుకున్నారు. ఏడో స్నాతకోత్సవంలో 506 మంది బాలురు, 161 మంది బాలికలకు డిగ్రీలు పట్టాలు ప్రదానం చేస్తారు. వీరితో పాటు పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందచేయనున్నారు. సంస్థలో మొత్తం ఎనిమిది కోర్సులను నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కొక్క విద్యార్థి చొప్పున మొత్తం ఎనిమిది మంది విద్యార్థులకు బంగారు పతకం అందిస్తారు. స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిట్ అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్.జయరామ్ తెలియచేశారు.



నిట్‌లో స్నాతకోత్సవం జరిగే రవీంద్రభారతి

బంగారు పతకాలు అందుకొనేది వీరే

బయో టెక్నాలజీ – శశాంక్, కెమికల్ ఇంజనీరింగ్ –సంగెపు అభినవ్, సివిల్ ఇంజనీరింగ్ – తమ్ము హరిత, సీఎస్ఇ– కలిదిండి పవన్ తేజ సత్యవర్మ, ఈఈఈ– ఆదిత్య ప్రతాప్ సింగ్, ఈసీఇ– చిత్తిడి ధనుషాలక్ష్మి దుర్గ, మెకానికల్ ఇంజనీరింగ్ – వుడుమూడి ప్రియాంక, ఎంఎంఇ– జయస్మిత కే ప్రధాన్ బంగారు పతకాలు అందుకుంటారు. బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్‌పాయింట్లు సాధించిన కలిదిండి పవన్ తేజ సత్యవర్మ ఇనిస్టిట్యూట్ తరపున కోర్సు వారీగానే రెండు బంగారు పతకాలను అందుకోనున్నారు.

ఆంధ్రా చేపల సాగు అదుర్స్

జార్ఖండ్ ఆక్వా రైతుల కితాబు

కైకలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కొల్లేరు ప్రాంతంలో ఆక్వా సాగు అచరణాత్మకంగా ఉందని జార్ఖండ్ రాష్ట్ర ఔత్సాహిక చేపల రైతులు కితాబిచ్చారు. మూడు రోజుల క్షేత్ర స్థాయి పరిశీలనలో భాగంగా కైకలూరు పరిసర ప్రాంతాల్లో రైతుల బృందం గురువారం పర్యటించింది. కైకలూరు మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.రాజ్‌కుమార్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్.గణపతి ఆక్వా సాగు మెలకువలను రైతులకు వివరించారు. ఆటపాక గ్రామంలో ముదునూరి సీతారామరాజు చేపల చెరువును పరిశీలించి సాగు విధానాలను రైతుల నుంచి సేకరించారు. కై కలూరులో పలు ఆక్వా మందుల దుకాణాలను సందర్శించి చేపల సాగులో ఎదురవుతున్నా వ్యాధులు, ఎటువంటి మందులు వినియోగిస్తారు అనే విషయాలు నమోదు చేసుకున్నారు. అక్కడ నుంచి ఆచవరంలో చేపల ప్యాకింగ్ చేసే విధానాన్ని పరిశీలించారు. చివరిగా మండవల్లి మండలం కొర్లపాడులో కొరమేను చేపల సాగును పరిశీలించి రైతు నుంచి సాగు పద్ధతులు, పెట్టుబడి, కొరమేను విత్తనం, మార్కెట్‌లో రేటు, నీటి వనరులు వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. బృందానికి నాయకత్వం వహించిన జార్ఖండ్ ఫిషరీష్ ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్‌కుమార్ దీపక్ మాట్లాడుతూ నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు(ఎన్ఎఫ్‌డీబీ), హైదరాబాదు సౌజన్యంతో జార్ఖండ్ ప్రభుత్వ మత్స్య, పశుసంవర్థక, కోఆపరేటివ్‌శాఖ ఆధ్వర్యంలో 15 మంది రైతులు బృందం వచ్చామన్నారు. ఇక్కడ సేకరించిన ఆక్వా సాగు పద్ధతులను జార్ఖండ్ ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. శుక్రవారం కొల్లేరు ప్రాంతంలో మరింతగా చేపల సాగు పద్ధతులను తెలుసుకుని, శనివారం మచిలీపట్నం వెళతామన్నారు. కార్యక్రమంలో గ్రామ మత్స్యశాఖ సహాయకుడు గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



ఆటపాక చేపల చెరువు వద్ద జార్ఖండ్ రైతులు

రైతుల భూములతో ‘కూటమి’ వ్యాపారం

- ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత
- రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైతుల భూములతో రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతా మోహన్ విమర్శించారు. గురువారం ఏలూరు నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల నుంచి బలవంతంగా 70 వేల ఎకరాలు తీసుకుందని మండిపడ్డారు. రైతుల భూములతో, రాష్ట్ర ప్రభుత్వం వ్యాపారం చేస్తోందని, ఒకాయన బయట రాష్ట్రాల్లో ఉన్న ప్రముఖులకు ఫోన్లు చేస్తూ మీకు 100 ఎకరాలు ఇస్తాం.. మాకేం ఇస్తారు అని అడుగుతున్నారన్నారు. భూములు ఇచ్చిన రైతులకు న్యాయం జరగలేదని, రైతులను దగా చేశారని, ఒక రైతు 90 ఎకరాలు ఇచ్చాడని, ఎందుకిచ్చావయ్యా అని అడిగితే, మా ఖర్మకొద్దీ ఇచ్చామని బాధతో వాపోయాడని తెలిపారు.



అభివృద్ధి కుంటుపడింది

రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, ఏడాదిన్నరలోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోందని చింతా మోహన్ అన్నారు. గ్రామాల్లో పరిస్థితులు చాలా బలహీనంగా ఉన్నాయని, వీధిలైట్లు, రోడ్లు వేసుకునేందుకు డబ్బులేక, సర్పంచ్‌లు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని చెప్పారు. లిక్కర్ అమ్మకాల వల్ల కుటుంబాల్లో విభేదాలు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేతలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇస్తే సరిపోతుందా, ఈ చర్యతో ఓబీసీలకు పెద్దపీట వేసినట్టేనా అని చింతా మోహన్ ప్రశ్నించారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం

జంగారెడ్డిగూడెం : కూటమి ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతోందని వైఎస్సార్‌సీపీ బీసీ నాయకులు, బీసీ ప్రజాప్రతినిధులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం స్థానిక పీపీఎస్ చంద్రరావు స్వగృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పట్టణ వైఎస్సార్‌సీపీ మాజీ అధ్యక్షుడు, కౌన్సిలర్‌లు పీపీఎస్‌చంద్రరావు, చిటికెల అచ్చిరాజు, చనమాల శ్రీనివాస్, బత్తిన చిన్న, భావన రుషి తదితరులు మాట్లాడారు. 50 సంవత్సరాలకు బీసీలకు పింఛన్ ఇస్తానని చంద్రబాబు మోసం చేశారని ధ్వజమెత్తారు. తల్లికి వందనం అందరికీ ఇవ్వలేదన్నారు. బీసీలను ఆకాశానికెత్తేస్తానని కల్లబొల్లి మాటలు చెప్పి చంద్రబాబు మరోసారి మోసం చేశారన్నారు. 2014లో కూడా బీసీలకు ప్రాతినిధ్యం లేదని, ప్రాధాన్యత సీట్లు కూడా ఇవ్వలేదన్నారు. బీసీ మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి ఇవ్వలేదని, బీసీల్లో చేతివృత్తులకు రుణం ఇస్తామని మొండి చేయి చూపించారన్నారు. హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక చేతులు ఎత్తేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. పవన్ కళ్యాణ్ కూడా నిలకడలేని మనస్తత్వం అని, పొంతనలేని మాటలు మాట్లడతారని విమర్శించారు. ఈవీఎంల అక్రమాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 53 శాతం ఉన్న బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ అంటే హత్యలు, అత్యాచారాలు, అవినీతి, అరాచకాలు, తప్పుడు ప్రచారాలు, తప్పుడు కేసులు పెట్టడమేనా అని ప్రశ్నించారు. చేనేత కార్మికులకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. లోకేష్ మంగళగిరిలో చేనేత కార్మికులకు చేసింది ఏమీ లేదని మండిపడ్డారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ బీసీ నాయకులు, ప్రజాప్రతినిధులు

పథకాల అమలు జగన్‌కే సాధ్యం

మాటిస్తే మడమ తిప్పని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే పథకాలు అమలు సాధ్యమని వైఎస్సార్ సీపీ నేతలు పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ పాలనలో బీసీలకు పట్టం కట్టారని, డీసీఎంఎస్, డీసీసీబీ చైర్మన్‌లు, ఎమ్మెల్సీలు ఆరుగురు, రాజ్యసభ సభ్యుల నలుగురికి పదవులు కల్పించారన్నారు. జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ పదవిని బీసీ మహిళకు కేటాయించడంతో జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఇచ్చిన ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరిగిందన్నారు. చేనేత సొసైటీలకు నూలు, రంగులు సబ్సిడీపై ఇవ్వాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎల్.వెంకటేశ్వరరావు, కేమిశెట్టి మల్లిబాబు, చిప్పాడ వెంకన్న, నేట్రు గణేష్, పెసరగంటి త్రిమూర్తులు, పెప్సీ శ్రీను, చిటికెల అచ్చిరాజు, ఆదినారాయణ, మాధవ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొన్న లారీ

ఒకరి మృతి, బస్సు డ్రైవర్‌కు గాయాలు





బస్సు ముందుభాగం దెబ్బతిన్న దృశ్యం, ప్రమాదంలో మృతి చెందిన కె.గణేష్

భీమడోలు: పొలసానిపల్లి ఫ్లై ఓవర్ వంతెనపై బుధవారం అర్ధరాత్రి ప్రైవేటు ట్రావెల్ బస్సును లారీ ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన కె.గణేష్ (28) కుటుంబ పోషణ నిమిత్తం నెల్లూరులోని ఓ రైస్ మిల్లులో కూలీగా పని చేస్తున్నాడు. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో స్వగ్రామంలోని కుటుంబ సభ్యులను చూసేందుకు గణేష్, తులసి ప్రైవేటు ట్రావెల్ బస్సు టికెట్‌ను రిజర్వేషన్ చేయించుకున్నాడు. బుధవారం రాత్రి నెల్లూరు నుంచి అనకాపల్లికి బస్‌లో వెళ్తుండగా మార్గమధ్యమైన పొలసానిపల్లి ఫ్లై ఓవర్ వంతెన వద్దకు వచ్చేసరికి ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా లారీని నడుపుతూ బస్సును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ వెనుక సీటులో కూర్చుని నిద్రిస్తున్న కె.గణేష్ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్‌కు కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్ సిబ్బంది ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కె.గణేష్ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ప్రమాదంలో బస్సు ముందుభాగం దెబ్బతింది. ఈ బస్సులో 30 మంది ప్రయాణిస్తుండగా ప్రమాదం జరిగిన వెంటనే వారంతా బెంబేలెత్తిపోయారు. అదృష్టవశాత్తూ వారికి ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జరిమానా

భీమవరం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వ్యక్తులకు కోర్టు జరిమానా విధించినట్లు సీఐ జి కాళీచరణ్ చెప్పారు. భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేడ్కర్ సెంటర్, పద్మాలయ థియేటర్, బీవీ రాజు విగ్రహం ఏరియాల్లో మద్యం సేవించి వాహనాలు నడుతున్న ఆరుగుర్ని అరెస్ట్ చేసి భీమవరం, స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ వద్ద హాజరుపర్చగా రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న ముగ్గురికి రూ.500 చొప్పున జరిమానా విధించారని చెప్పారు.

● ఇంటికి వెళ్లే దారేది!



ఏజెన్సీప్రాంతంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దొరమామిడి, అలివేరు, లంకపాకల, ఎర్రాయిగూడెం, అంతర్వేదిగూడెం, కామవరం, తదితర గ్రామాల్లో భారీగా వర్షం కురవడంతో కొండ వాగులు పొంగిపొర్లాయి. చింతకొండ వాగుతోపాటు రెడ్డిగణపవరం సమీపంలో ఉన్న జల్లేరువాగు పొంగి పొర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సాయంత్రం సమయానికి పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, కూలీలు, రైతులు ఇంటికి చేరే మార్గం లేక జల్లేరు వాగుకు ఇరువైపులా నిలబడిపోయారు. రాత్రి వరకూ వాగులు పొంగుతూనే ఉన్నాయి. – బుట్టాయగూడెం

వారం రోజుల తర్వాత ఇంటికి మృతదేహం

మధ్యప్రదేశ్‌లో వ్యాన్ బోల్తా.. కొల్లేరు వాసి మృతి

కైకలూరు: చేపల లోడ్‌తో వెళుతూ మధ్యప్రదేశ్ రాష్ట్ర జబ్బల్‌పూర్ వద్ద వ్యాన్ బోల్తా పడటంతో పందిరిపల్లిగూడెంకు చెందిన వ్యాన్ డ్రైవర్ కర్షం చిరంజీవి చంద్రమౌళి (27) జూలై 31న మరణించాడు. ఇదే ప్రమాదంలో నత్తగుళ్ళపాడుకు చెందిన క్లీనర్ దావీదుకు తీవ్ర గాయాలయ్యాయి. ఫంగస్ చేపల లోడుతో వెళుతున్నా వ్యాన్ అక్కడ డివైడర్‌ను ఢీకొట్టడంతో బోల్తా పడింది. విషయం తెలుసుకుని కుటుంబ సభ్యులు వెళ్లగా పోస్టుమార్టం అనంతరం చిరంజీవి మృతదేహాన్ని బుధవారం గ్రామానికి తీసుకొచ్చారు. చిరంజీవికి భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. రాష్ట్ర వడ్డీ సాధికారిత కమిటీ చైర్మన్ బలే ఏసురాజు, పలువురు కొల్లేరు పెద్దలు చిరంజీవి భౌతికకాయానికి నివాళి అర్పించారు. చిరంజీవి మరణంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



చిరంజీవి మృతదేహం

బూజు పట్టిన పరోటాల విక్రయంపై కేసు నమోదు





బూజు పట్టిన పరోటాలను చూపిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్ఆర్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం విజేత స్టోర్‌ను జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్ఆర్ రెడ్డి తనిఖీ చేసి బూజు పట్టిన పరోటాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. భీమవరానికి చెందిన పడమటి దిలీప్‌కుమార్ ఈనెల 5వ తేదీన విజేత స్టోర్‌లో ఫ్రెస్ బెల్ కంపెనీ మలబార్ పరోటాలు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లి చూడగా బూజు పట్టి ఉన్నాయి. దీంతో ఆయన వాటిని స్టోర్‌కు తీసుకువచ్చి అసిస్టెంట్ సేల్స్ మేనేజర్‌కు చూపించారు. అదే బ్యాచ్‌లో ఉన్న మరో ప్యాకెట్ కూడా ఓపెన్ చేసి చూడగా ఆ ప్యాకెట్‌లోని పరోటాలూ బూజు పట్టి ఉండడంతో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఏఎస్ఆర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఆయన స్టోర్‌ను తనిఖీ చేసి పరోటాలు బూజు పట్టి ఉండడాన్ని గుర్తించి జేసీ కోర్టుకు కేసు నమోదు చేశారు. రాజమండ్రికి చెందిన ఫ్రెస్ బెల్ కంపెనీ నుంచి పరోటాలు సరఫరా అవుతున్నాయని, మిగిలిన వాటిని కూడా పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపిస్తామని ఏఎస్ఆర్ రెడ్డి చెప్పారు.

క్లుప్తంగా

'గూడెం' రూరల్ సీఐగా రవికుమార్


సీఐగా బాధ్యతలు స్వీకరించిన రవికుమార్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లి గూడెం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బండే భీమేశ్వర రవి కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేసిన రవికుమార్ బదిలీపై విజయవాడ వెళ్లారు. ఆయన స్థానంలో భీమేశ్వర రవికుమార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ప్రజలంతా సహకరించాలని కోరారు.

అధిక వ్యవసాయోత్పత్తుల సాధనపై పరిశోధనలు


ఇటుకులగుంట గ్రామంలో స్వామినాథన్ శత జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయ శాస్త్రం చదివి ఎన్నో పరిశోధనలు చేసి వ్యవసాయ పంటలు అధిక దిగుబడులకు ఎంఎస్ స్వామినాథన్ కృషి చేశారని ఏపీ రైతు సంఘం నాయకుడు పాలుపూరి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఇటుకులగుంట గ్రామంలో ఎంఎస్ స్వామినాథన్ శత జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం బాగుండాలంటే వ్యవసాయం అభివృద్ధి చెందాలని భావించిన వ్యక్తి స్వామినాథన్ అన్నారు. ఆయన కుటుంబ నేపథ్యం డాక్టర్లు, ఐఏఎస్‌లు కాగా, వ్యవసాయ శాస్త్రాన్ని అభ్యసించి ఎన్నో పరిశోధనలు చేసిన మహనీయుడని కొనియాడారు. వ్యవసాయ రంగంలో శాస్త్ర పరిజ్ఞానాన్ని మిళితం చేశారన్నారు. మహిళా నాయకులు పాలుపూరి సత్యవతి, బంకురు యశోద, పాలుపూరి శ్రీనివాస్, బంకురు సత్యనారాయణ, పాలుపూరి ధనలక్ష్మి, పాలుపూరి వెంకట నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి


సమావేశంలో మాట్లాడుతున్న చింతకాయల బాబూరావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ వ్యవసాయ రంగంలో డాక్టర్ స్వామినాథన్ తీసుకు వచ్చిన మార్పులతో రైతుల జీవితాల్లో వెలుగులు నిండాయని సీఐటీయూ నాయకుడు చింతకాయల బాబూరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణలు తెలిపారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ శత జయంతిని గురువారం నిర్వహించారు. ముందుగా స్వామినాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వామినాథన్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు, వి.సత్యనారాయణ, సుబ్బయ్య, జక్కంపూడి బంగారయ్య, దానయ్య, మాదాసు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి అమానుషం

పాలకొల్లు సెంట్రల్: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గంలో జరుగుతున్న పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గూండాలు చేసిన దాడి అమానుషమని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతోమాట్లాడుతూ పులివెందుల మండలం నల్లగొండువారి పల్లెలో జెడ్పీటీసీ అభ్యర్థి తుమ్మల హేమంత్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తుంటే టీడీపీకి చెందిన కొందరు గూండాలు ఒక్కసారిగా రమేష్ యాదవ్, అతని అనుచరులపై మీదపడి దాడి చేయడం చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యంలోఉన్నామా? అనిపిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలకే ప్రాధాన్యతనిస్తుంది తప్ప ప్రజాపరిపాలనకు కాదని అన్నారు. ప్రజాప్రతినిధికే రక్షణ లేకపోతే ఎలా మనుగడ సాగించగలరు? అని సందేహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

12న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

నరసాపురం రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని ఈ నెల 12న నిర్వహించాలని ఎంపీడీఓ కె.వీరభద్రరావు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిధిలోని వైద్యులు, విద్యాశాఖ అధికారులతో కలిసి సమావేశం టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని మాత్రలను వేయించాలన్నారు.

దోమలు బాబోయ్.. దోమలు

- జ్వరాల బారిన పడుతున్న జనం
- పారిశుద్ధ్య లోపమే కారణమంటూ విమర్శలు
- నిర్మూలన చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు


రేలంగిలో రోడ్డుపై చెత్త పడేసిన దృశ్యం


రేలంగిలో వర్షాలకు నిండిన మురుగు బోదె

ఇరగవరం: మండలంలోని రేలంగి పంచాయతీ పరిధిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షానికి దోమలు విపరీతంగా పెరిగిపోయి దండ యాత్ర చేస్తున్నాయి. దోమల నివారణకు దండయాత్ర చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం వాటి నివారణకు ఏవిధమైన చర్యలూ చేపట్టడం లేదు. పట్టణాల్లోనూ, పల్లెల్లో దోమల బెడదతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. పలు వార్డుల్లో జ్వరాలతో బాధపడుతున్నారు. రోడ్లపై సాయంత్రం ఐదు గంటలకే ప్రజలు నడవలేని, ప్రయాణించలేని దుస్థితి ఏర్పడింది. పట్టపగలే దోమలు విపరీతంగా ఇళ్లల్లో కుడుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. రేలంగి పంచాయతీలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలను శుభ్రం చేయడం లేదు. దీంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోమల నివారణకు ఏ విధమైన చర్యలూ తీసుకోవడం లేదు. గతంలో దోమల నిర్మూలనకు మందు పిచికారీ చేసేవారు. ఫాగింగ్ మిషన్లు ఉన్నప్పటికీ వాటిని అటకెక్కించారనే ఆరోపణలు ప్రజలు ద్వారానే విన్పిస్తున్నాయి. డ్రెయినేజీల్లో ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వాను చంపే చర్యలు చేపట్టినప్పటికీ నేడు ఆ పరిస్థితి లేదు. ప్రధాన డ్రెయిన్లలో దోమలు అధికంగా పుట్టుకొస్తున్నాయి. నీటి నిల్వలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. జ్వరాలతో ప్రజలు అల్లాడి పోతున్నారు. సీజనల్ జ్వరాలు వస్తున్నప్పటికీ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. ఏఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి జ్వరాల సర్వే చేస్తున్నా, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు జ్వర పీడితులు క్యూ కడుతున్నారు. ఇటీవల జ్వరంతో చాలా మంది బాధపడుతూ వైద్యం పొందుతున్నారు. జ్వరం వస్తే నీరసించిపోయి, తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందు జాగ్రత్తలు లేవు

నగర పంచాయతీ, పల్లెల్లో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టడం లేదు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా, మెదడువ్యాపు, ఎన్‌సెఫలైటిస్(పిల్లల్లో)వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందంటున్నారు. పంచాయతీలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏవిధమైన చర్యలు చేపట్టడం లేదు. ఎక్కడిక్కడ నీటి నిల్వలు, డ్రెయినేజీల్లో క్లియరెన్స్, పారిశుద్ధ్య నిర్వహణ, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాల్సి ఉంది. ఇటువంటి చర్యలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండదు. ఎప్పటికప్పుడు మలేరియా డిపార్టుమెంట్ నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకుంటూ పంచాయతీలకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సి ఉంది.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం



ఒక ఫాగింగ్ యంత్రం మాత్రమే ఉంది. దానితోనే మొత్తం రేలంగి పంచాయతీలోని వార్డులు, ఏడు శివారు ప్రాంతాల్లో దోమల నివారణ కోసం నాలుగు రోజులకు ఒక సారి స్ప్రే చేయిస్తున్నాం. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లో అవగాహన చర్యలు తీసుకుంటున్నాం.
బి లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి రేలంగి.

సచివాలయ సిబ్బందికి వీడ్కోలు


నవాబుపాలెం సచివాలయం వద్ద బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం సచివాలయంలో విధులు నిర్వర్తించి వేర్వేరు చోట్లకు బదిలీపై వెళ్తున్న మహ్మద్ అహ్మద్, ద్వారంపూడి చంద్రశేఖర్, కేదారి రెడ్డి, కోలా వినయ్ కుమార్, మద్దాల వరలక్ష్మి, మల్లుల లక్ష్మి, స్నేహ సౌగంధిక, నీలపాల వెంకటేశ్వరరావులకు గురువారం వీడ్కోలు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి సచివాలయ సిబ్బంది అందించిన కృషిని వివరించారు. కొత్తగా చేరుతున్న సచివాలయంలోనూ సమర్థవంతంగా పనిచేసి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. అలాగే నూతనంగా వచ్చిన సిబ్బందికి స్వాగతం పలికారు. పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసరావు, పంచాయతీ బోర్డు సభ్యులు, మద్దుకూరి ధనరాజు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు వరలక్ష్మి శోభ

- చుక్కలు చూపిస్తున్న ధరలు
- రద్దీగా రహదారులు


వరలక్ష్మి వ్రతం సందర్భంగా తణుకులో పండ్ల దుకాణంలో కొనుగోళ్లు

తణుకు అర్బన్: తణుకు మార్కెట్ శ్రావణ శోభను సంతరించుకుంది. శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా పూజా సామగ్రి, బంగారు రూపుల విక్రయాలకు అధికసంఖ్యలో దుకాణాలు వెలశాయి. పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వచ్చిన మహిళలతో రాష్ట్రపతి రోడ్డు సందడిగా మారింది. అయితే గతం కంటే కొనుగోళ్ల శాతం తగ్గాయని వ్యాపారులు డీలా పడ్డారు. మరోపక్క పూజాసామగ్రి ధరలు పెరిగి వినియోగదారులకు చుక్కలు చూపించాయి. శ్రావణమాసంలో వచ్చే శుక్రవారాలను మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. రెండవ శుక్రవారానికి హిందూ సాంప్రదాయంలో అధిక ప్రాముఖ్యత ఉంది. ఆ రోజున వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తే సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని నమ్మకంతో రెండో శుక్రవారం వ్రతం చేసుకునేందుకు మహిళలు అధిక ప్రాధాన్యమిస్తారు. పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులతో మార్కెట్ ప్రాంతమైన రాష్ట్రపతి రోడ్డు, వేల్పూరు రోడ్డు, సొసైటీ రోడ్డు రద్దీగా మారాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పువ్వులు, పండ్లు, పత్రి, ఇతర పూజా సామగ్రి దుకాణాలు ఆకర్షణగా నిలిచాయి.


తణుకులో పువ్వుల దుకాణాల్లో కొనుగోళ్ల సందడి


తణుకులో మామిడి ఆకులు, పత్రి అమ్మకాలు

చుక్కలు చూపించిన పూజా సామగ్రి ధరలు...

పూజకు వినియోగించే మామిడి ఆకులు, ఇతర పత్రి సామగ్రిని వ్యాపారులు తీసుకువచ్చి అమ్మకాలు సాగించారు. యాపిల్ పండ్లు జత రూ. 50 నుంచి రూ. 80, దానిమ్మకాయ ఒక్కొక్కటి రూ. 30 నుంచి రూ. 60 వరకు అమ్మకాలు సాగించారు. ఇక సీతాఫలం, మారేడికాయి వంటి రకాలు కాయి రూ. 30గా విక్రయాలు చేశారు. చామంతి పువ్వులు 100 గ్రాములు రూ. 60 నుంచి రూ. 80 విక్రయించారు. దీంతో కొనుగోలుదారులు ఇబ్బందులు విలవిల్లాడారు.

భారత్‌పై వేసిన సుంకాలు ఉపసంహరించుకోవాలి



తణుకులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

తణుకు అర్బన్: ట్రంప్ భారత్‌పై వేసిన సుంకాలు వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ అన్నారు. గురువారం స్థానిక వెంకటేశ్వర సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో భారత్ పై ట్రంప్ వేసిన సుంకాలు, అమెరికాలో భారతీయులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఏ. అజయ కుమారి మాట్లాడుతూ ట్రంప్ భారత్ పై దాడి చేస్తున్నా మోదీ ఎందుకు నోరుమెదపడం లేదని విమర్శించారు. భారత ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నం చేయడానికి ట్రంప్ ప్రయత్నం చేస్తుంటే మోదీ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం శోచనీయమని అన్నారు. ఈ సుంకాలు పెంచడం వలన భారత ప్రజలపై భారీగా భారాలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు కూడా ఈ విషయాలు పై ఎక్కడికక్కడ నిరసనలు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గార రంగారావు, కామన మునిస్వామి, గుబ్బల గోపి, ఎం.రమేష్, వీఎస్ శివ కుమార్, పి. రాజా, సీహెచ్ రమణ, సింగులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోషణతోనే అధిక పాల దిగుబడులు


చినతాడేపల్లి గ్రామంలో పాడి గేదెలకు చూడి పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పాడి గేదెలకు సంపూర్ణ పోషణతోనే అధిక పాల దిగుబడులు సాధించవచ్చని మండల పశువైద్యాధికారి టివి.విజయ్‌కుమార్ సూచించారు. గురువారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో పాడి గేదెలకు ఎద పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ సీజనల్‌గా వచ్చే వ్యాధులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. లేకుంటే పాల దిగుబడులు తగ్గడంతో పాటు పశువులు చనిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అందించే గడ్డిపై రాయితీ అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం లింగ నిర్ధారిత వీర్యం, పాముల మందు ఆవశ్యకతను వివరించారు. 43 పాడి గేదెలకు చూడి పరీక్షలు చేసి, మందులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ క్రాంతి, వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'గూడెం' మండలంలో కుండపోత వర్షం


తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట ఎస్సీ ఏరియాలో అపారిశుద్ధ్యం నెలకొన్న దృశ్యం


ఉప్పరగూడెం గ్రామంలో కాలనీలో నిలిచిన వర్షపు నీరు


దండగర్ర - మెట్ట ఉప్పరగూడెం రహదారిపై ఏర్పడిన గోతుల్లో నిలిచిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో గురువారం కుండపోత వర్షం కురిసింది. ప్రధానంగా మాధవరం, మోదుగ గుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, ఉప్పరగూడెం, మెట్ట ఉప్పరగూడెం, దండగర్ర, లింగారాయుడిగూడెం, ఇటుకులగుంట, తాళ్ల పాలెం తదితర గ్రామాలు తడిసి ముద్దయ్యాయి. గత 10 నుంచి 15 రోజులుగా కాస్తున్న ఎండల నుంచి ఈ వర్షంతో గ్రామీణ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. భారీ వర్షానికి గ్రామాల్లోని ప్రధాన రహదారులు తడిసిముద్దవ్వడంతో పాటు లోతట్టు రహదారులు జలమయమయ్యాయి. వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై వాటిలోనే ప్రజలు రాకపోకలు సాగించవలసి వచ్చింది.

బీసీల ఆరాధ్యుడు బీపీ మండల్


బీపీ మండల్ దినోత్సవం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీసీల ఆరాధుడు బీపీ మండల్ అని పలువురు బీసీలు కొనియాడారు. మండల్ దినోత్సవాన్ని గురువారం పట్టణంలో నిర్వహించారు. మండల్ చిత్రపటానికి నాయకులు, సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బీసీల బతుకులు మార్చడానికి బీజం వేసిన వ్యక్తి బీపీ మండల్ అని కొనియాడారు. బీసీలు అందరూ ఒకే తాటిపైకి వచ్చి మండల్ సిఫార్సులు అమలు చేసే విధంగా పోరాటాలు చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశవభట్ల విజయ్, తుమరాడ చిన్నా, వాకా నాని, అత్తిలి బాబి, నరసింహమూర్తి, బీసీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలి


భవితలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగులను ప్రతిఒక్కరూ ఆదరించాలని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక సుబ్బారావుపేటలోని భవితా దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో గురువారం సక్షమ్ ఆధ్వర్యంలో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దివ్యాంగులకు రాఖీలు కట్టి మిఠాయిలు పంచారు. డ్రాయింగ్ బుక్స్, క్రేయాన్స్, బహుమతులు అందజేశారు. సక్షమ్ జిల్లా అధ్యక్షుడు కేఎస్‌కేఎస్ అప్పారావు మాట్లాడుతూ రాఖీ పండుగ వేడుకలు పిల్లలతో నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని, భవిష్యత్తులో దివ్యాంగుల పిల్లల సక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని వెల్లడించారు. నార్మల్ పిల్లలతో పాటుగా దివ్యాంగులను చూడాలన్నారు. కె.విజయలక్ష్మి, సుధీర్‌కుమార్, ప్రత్యేక ఉపాధ్యాయు లు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ మరమ్మతులతో ఇక్కట్లు


మొదటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి డౌన్‌లో ట్రాఫిక్ ఇక్కట్లు

- ఫోర్ట్‌గేట్ సమీపంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభం మార్పిడి


అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంను తొలగించి కొత్త విద్యుత్ స్తంభంను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో చేపట్టిన విద్యుత్ మరమ్మతు పనులతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. గురువారం వన్‌టౌన్‌లోని ఫోర్ట్‌గేట్ డ్రగ్ హౌస్ సమీపంలో రహదారిలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభంను తొలగించి డ్రెయిన్‌కు అవతల వైపు నూతన విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఇందుకు చాలా సమయం పట్టడంతో మొదటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి డౌన్, పురపాలక సంఘ కార్యాలయం వైపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా కేఎన్ రోడ్డు జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద విద్యుత్ వైర్లుకు అడ్డంగా ఉన్న చెట్లు కొమ్మలను నరకడంతో ఆయా ప్రాంతాల్లో వాహనదారులు కూడా ఇబ్బందులు పడ్డారు. మెయిన్ రోడ్డు, మునిసిపల్ కార్యాలయం ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం, వేసవి తలపిస్తున్న ఎండలతో ఆయా ప్రాంతాల ప్రజలు, వ్యాపారస్తులు ఉక్కపోతతో ఇక్క ట్లు పడ్డారు. విద్యుత్ సరఫరా నిలుపుదలపై ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం గమనార్హం.

భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి


అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు నాయకులు, సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాలలు హక్కుల పోరాటం చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. రూరల్ మండలంలో జరిగిన అత్యవసర సమావేశంలో అంబేద్కర్ విగ్రహానికి మంగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మాలలు ఇప్పటికై న మేలుకోవాలన్నారు. మాలల హక్కులు కోసం పోరాటం చేయాలని, టీడీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. దళితులంటే చంద్రబాబుకు చులకన భావన ఉందని, మాదిగలపై కపట ప్రేమ చూపిస్తూ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ రద్దు చేసేందుకు చంద్రబాబు కుట్ర చేస్తున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాల సంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షురాలు ఉన్నమట్ల విజయకుమారి, నందిరాజు, మోషే, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

పాలకొల్లు సెంట్రల్: మెరిట్ విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ చదువుకు దూరమయ్యే పరిస్థితి ఉంటే వాకర్స్ క్లబ్ తనవంతు సహాయ సహకారం అందిస్తుందని క్లబ్ అధ్యక్షులు తటవర్తి సుధాకరరావు తెలిపారు. గురువారం స్థానిక ఛాంబర్స్ కళాశాలలో మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ కోర్సు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులకు అవసరమైన పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సుధాకరరావు మాట్లాడుతూ విద్యార్థినులు చదువు ఆర్థిక సమస్యలతో ఆగిపోకూడదనే ఉద్దేశంతో రూ. 4 వేలు విలువ చేసే పుస్తకాలను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు మానెం బసవరాజు, పీర్ సాహెబ్, జవ్వాజి కల్యాణ్, కర్రి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.